# మంచి నాటకం!
# మంచి సమాజం!

రావూరు వెంకట సత్యనారాయణరావు

సాధారణంగా మనం వింటూ వుంటాం, తెనుగు నాటకరంగ ప్రసక్తి వచ్చినప్పుడల్లా "మంచి నాటకం లేదు-మంచి సమాజం లేదు" అనే మాటలు ప్రతి సంవత్సరం వందలకు వందలు నాటకాలు వస్తూనే వున్నాయి. కొందరైనా పూనుకొని వాటిని ప్రదర్శిస్తూనే వున్నారు.

మామూలుగా వెలిసే సమాజాలు కాక, ప్రతి ఆఫీసులో, ప్రతి సంస్థలో సాంస్కృతిక సంఘా లేర్పడుతున్నాయి వాటిని నాటక శాఖ లుద్ధరిస్తున్నాయి వరుసగా నాటకాలు ప్రదర్శించలేకపోయినా, వార్షికోత్సవాలకైనా నాటికో, నాటకమో ప్రదర్శిస్తున్నారు అందులోనే కొందరు బహుమతు లందుకొంటున్నారు తక్కిన నటుల్లో కొంచెం గర్వంతో తల ఎత్తుకు తిరుగుతున్నారు అయినా మంచి సమాజాలు లేవనే వాదు పోలేదు

అంతకుముందు మాట ఎలా వున్నా ఇరవై సంవత్సరాల నుంచి పరిషత్తు నాటక, నాటిక ప్రదర్శనల్లో పోటీలు పెడుతోంది సమాజానికి, రచయితకు, నటీనటులకు, రంగాలంకరణకు బహుమతు లిస్తోంది. ఇటీవల లెక్కల్ని బట్టి - ఏటా నూటికి పైగా నాటకాలు, నాటికలు పోటీలకు దరఖాస్తులు పెడుతున్నాయి. పోటీలకు నిలుస్తున్నాయి సుమారో డజను ప్రదర్శనలు - పరిషత్తు సమయంలో ఏర్పాటు చేయబడుతున్నాయి ప్రథమ బహుమతి ఏటా ఒక సమాజానికి అందించబడుతునే వుంది. అయినా మంచి నాటక సమాజం లేదనే వార్త వినిపిస్తూనే వుంది

నాట్యసంఘం ఏర్పడింది. దాని పక్షాన నాట్యవిద్యాలయం ఏర్పడింది నాటక శిక్షణ తరగతులు నడుపుతున్నారు కన్యాశుల్కం నాటకం, శ్రీ అబ్బూరి రామకృష్ణరావు అధ్వర్యాన ప్రదర్శించబడింది ప్రశంస లందుకుంది వారే "వార్షికోత్సవం" అనే నాటికను కూడా ప్రదర్శించారు అయినా 'మంచి సమాజం'...అని నీళ్లు నములుతూనే వున్నారు

సంగీత నాటక ఎకాడమీ ఇంకా నాటకాలకు అంటూ బహుమానా లేం ఏర్పాటు చెయ్యలేదు చేసి, ఏవో కొన్ని నాటకాలను, 'మంచివి'గా భావించి బయట పెడితే ఏమంటారో తెలియదు పోతే నాటక సమాజాలకు సభ్యత్వం ఇచ్చింది కొన్నింటికి గ్రాంటు లిస్తోంది. ఎవరైనా మంచి నాటకం ప్రదర్శిస్తామంటే ప్రోత్సహిస్తోంది 'క్షీరసాగరమధనం' లాటి నృత్య నాటికను తయారుచేయించింది ఇరవై వేల రూపాయల ఖర్చుతో ఈసారి ఉత్తమ నాటకాలకు బహుమతు లిస్తారని అనుకుంటున్నారు అయినా మంచి నాటకం మాట? మానడం లేదు

ఆంధ్ర నాటక కళాపరిషత్తుతో పాటు అనేక తావుల్లో వేరువేరు పరిషత్తులు వెలిసినాయి— ప్రొద్దుటూరులో, తిరుపతిలో — ఇంకా అనేక చోట్ల వీరందరూ



http://www.maganti.org

ప్రతి సంవత్సరం పోటీలు జరుపుతున్నారు - బహుమతులిస్తున్నారు... ఉత్తమ రచనల్ని, ఉత్తమ సమాజాల్ని ఎన్నుకొంటున్నారు. అయినా అసలు సమస్య అలాగే వుంది.

ఈ విషయాలన్నీ సమాలోచిస్తే...మంచి నాటకమంటే ఏమిటి ?— మంచి సమాజమంటే ఏమిటి ?— అనే ప్రశ్న వేసుకోవలసివస్తుంది కొందరు పౌరాణిక నాటకాలు మంచివంటారు, కొందరు చారిత్రాత్మకమైనవి అద్భుతమంటారు...ఎక్కువ మందికి సాంఘిక నాటకాలే కావాలి, తక్కినవాటి మాట అక్కరనేలేదు - అని ఘంటాపథంగా చెప్పుతూవుంటారు

సాంఘిక నాటకా లనగానే - ఆధునిక సమస్యలకు సంబంధించిన ఇతివృత్తం అనేది నిర్వివాదాంశం వాటినే ప్రదర్శించాలి. వ్రాయాలి అనేది అందరూ అంగీకరిస్తున్నారు అవిమాత్రమే కావాలిఅనేది కొందరు అంగీకరిస్తున్నారు. పరిషత్తులో నాటకాలు అంగీకరిస్తారు. పోటీకి, పౌరాణికాలు అంగీకరించరు...బహుశః పద్యాలు వుంటాయనీ, 'మజ్జారే', 'వహ్వారే' 'హృదయేశ్వరా ?' 'నాథా!' అనే మాటలు వినిపిస్తాయని అయివుండవచ్చు. హృదయేశ్వరులను దూరంగా తరిమి - నాథాలను కొట్టిపారేసి... వ్యవహారిక భాషలో సాదా సీదా సంబోధనలతో నాటకాలు వ్రాయడానికి పూనుకొందామని కొంద రనుకొన్నా — పద్యాలు వుండకూడదనే నిబంధన ఒకటి వుంది వాటికూ్కడా స్వస్థి చెపితేగాని - పౌరాణిక నాటకాలను, ఈనాటి రంగస్థలానికి అనుగుణంగా వ్రాయడం కుదరదు.

ఇలాటి ప్రయత్నాలు చలంగారు చేశారుగాని... వారు పద్యాలు వగైరాలతో పాటు, ఇంకా కొన్ని ప్రత్యేకతలు తీసివేశారు. చింతా దీక్షితులుగారి శబరిలాటి నాటికలు వ్రాశారుగాని - వాటిని ఎవరూ ప్రదర్శించడం లేదు. కనుక ఇటువంటివి పైకి రావడం మంచిదనిపించుకోవడం దూరపు విషయం.

పోతే సాంఘిక నాటకాలలో 'కన్యాశుల్కం' మంచి నాటకమనే పేరు సంపాదించింది అంతేకాదు... 'ఒక్కటే నాటకం' అన్న ఖ్యాతి కూడా సంపాదించింది. ఆ తర్వాత తెలుగులో నాటకమే లేదు - అనే విషయం కూడా చాలామంది వ్రాశారు ..వ్రాక్కుచ్చారుకూడా! కన్యాశుల్కంలాటి నాటకం వుందిగదా అని గర్వపడటం- ఆ తర్వాత అలాట నాటకం రాలేదే అని విచారపడటం- ఈ రెండూ మన ధర్మాలైనాయి.

మరి వేదంవారి 'ప్రతాపరుద్రీయం' కూడా మనకున్న గొప్ప నాటకాలలో ఒకటిగా భావించారు. కన్యాశుల్కంతో పాటుగా ఈ నాటకాన్ని నిలబెట్టారు. యుగంధరుడు — అంతా ఇంతా పేరు సంపాదించలేదు. అయినా ఆ నాటకంకూడా వెనకపడుతోంది - పద్యాల బాధో, పద్యంలోనే వున్న చిక్కువల్లనో, యుగంధరుడు ముంజులూరివారితోనే తెరచాటుకి పోయాడు

తర్జుమాలే అయినా చంద్రగుప్త నాటకం కొన్నాళ్ళు ప్రదర్శించబడింది. శ్రీ పింగళి నాగేంద్ర మేవాడ్ రాజ్యపతనం అనే చక్కని వచనం నాటకం వ్రాశారు ప్రదర్శన కెంతో చక్కగా వుంటుందా నాటకం...వీరే పాషాణి అనే మరోనాటకం వ్రాశారు. దీనిలో కూడా శక్తివంతమైన సంభాషణ లున్నాయి. వేలూరి చంద్రశేఖరంగారు "కాంచనమాల" అనే నాటకం వ్రాశారు. సంభాషణలు తెలుగు భాషకే వన్నెలుదిద్దాయి. ఇలా పేర్కొవాలంటే చాలా నాటకా లున్నాయి. వీటినెవరూ ప్రదర్శించరు... బైటికి తీసుకురారు. ఎకాడమీ ఇలాటివాటికి ప్రోత్సాహమిస్తే 'మంచి నాటకం' కనిపిస్తుంది.

'మంచినాటకమంటే' — అనే విషయం కూడా ఆలోచించాలి. దాని నిర్వచనం స్పష్టపడాలి ఎక్కువ ప్రదర్శనలు కలదా ? ఎక్కువ డబ్బు సంపాదించిందా ! ఎక్కువ బహుమతులు పొందిందా !... ఆధునిక నాటకాలలో ఎక్కువ ప్రదర్శనా లిచ్చిన నాటకాలు తక్కువ. దానికి నాటక లోపం కారణం కాకపోవచ్చు. సంఘ స్థోమతు కావచ్చుకారణం రెండు ప్రదర్శన లిచ్చేటప్పటికి ఆర్థిక దౌర్బల్యం ప్రాప్తించవచ్చు. బళ్లారి రాఘవాచార్యులుగారు వ్రాసివేసిన సరిపడని సంగతులకే ఎక్కువ ప్రదర్శనల అవకాశం లభించ లేదంటారు. అందులో ఇంకొక పరీక్ష వచ్చింది ఒక వూళ్లోనే అనేక ప్రదర్శనా లివ్వగల నాటకాలు మనకు లేవని. ఇది ప్రేక్షకుల లోపం అనడానికి వీలేదు నాటకం లోపమనడం భావ్యంకాదు. పోతే సంఘాలకు బలం లేకపోవడం అనుకోవచ్చు. అయినా, ఇలాటి ఆశయంతో నాటకాలాడటం మనకు అరుదు

మరి మంచి నాటకాలంటే ఏవి ? రచనలో వైశిష్ట్యం, రంగానుకరణలో కళావైదగ్ధ్యం, నటనలో ప్రత్యేకతా, సందేశంలో ప్రాభవం కలవి అయి వుండాలా? అన్నది కూడా సమాలోచించాలి ఇన్నివిధాలుగా ఆలోచిస్తే పండిత పామరుల్ని ఒక్క రీతిగా ఆకర్షించి, ప్రదర్శించే నటీనటవర్గానికి, తృప్తినీ, శాంతినీ కల్పించేదై వుండాల నేది—తేలుతుంది

మనకు నాటకాలకు కరువులేదు. కొక్కొండ వెంకటరత్నం పంతులు నుంచి — కొండముది గోపాలరాయ శర్మ వరకూ కొండభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి నుంచి, భమిడిపాటి రాధాకృష్ణ వరకూ, కందుకూరి వీరేశలింగం పంతులు నుంచి, పినిశెట్టి శ్రీరామమూర్తి వరకూ, గురజాడ మహాకవి నుంచి, ఆత్రేయ వరకూ — ఎండరెందరో ఎన్నెన్నో నాటకాలు వ్రాశారు. వీటిలో చాలావరకు...సాంఘికా లున్నాయి...అధునాతన ఇతివృత్తా లున్నాయి...అంతులేని కళాపిపాస వుంది. మరి వీటిలో మంచి నాటకాలు లేవనే అనుకోవాలా?

లేవనే వాదాన్నే అంగీకరిద్దాం మరి మంచి నాటకాలు సృష్టించడం ఎలా ? అవి మంచివని లోకానికి నచ్చచెప్పడ మెలా ? ఈ బాధ్యత ఎవరిది ? రచయితలదా ? నటులదా?...ఎకాడమీలదా ? ప్రజలదా ? — ఇది తేలడం కూడా అవసరమే ! కొందరికి నాటకాలు వ్రాయాలనిపిస్తుంది కలం తొందరపెడుతుంది, వ్రాస్తారు కొందరికి వేషాలు వెయ్యాలనే ఆసక్తి కలుగుతుంది. రంగులు వచ్చి ఎదుట నిలబడతాయి పూసుకొంటారు. వేషం వేసుకొంటారు ఏదో నాటకం తీసుకొంటారు ప్రదర్శిస్తారు ప్రజలు చూస్తారు ఇదంతా ఒక ఉత్సాహంతో కూడిన కార్యక్రమం ! దీన్ని అరికట్టడం భావ్యమా ! వీటిలోనుంచి ఉత్తమ నాటకాలు, నటీనటులు బయటపడకూడదా ! ఎందుకు పడరు ! కనుక ఈ పద్ధతి కూడా ఒక సోపానమే ! అపాయంగా భావించవలసిన పనిలేదు.

సమాజాల విషయం తీసుకొందాం చాలామందికి ఉత్సాహం ఎక్కువ. ఉత్సాహంలోనుంచి ఉపజ్ఞ పుట్టవచ్చు. దానివల్ల వారూ, రంగభూమి కూడా ఉత్తేజితులు కావచ్చు కనుక అదీ ఒక పవిత్ర సేవే ! అయితే ఒక విషయం గమనించాలి. ఈ ఔత్సాహిక వర్గాలలో చాలామంది యువకులే వుంటారు అనుభవజ్ఞులు అందులో ప్రవేశించరు 'వారు ఔత్సాహిక నటులు . మనం షష్టిపూర్తి ఉత్సవానికి సిద్ధంగా వున్నాం' అనుకుంటారు. కనుక చిన్నవాళ్లే పెద్ద వేషాలు వేస్తారు. చిన్నవాళ్లే పెద్దలుగా నిలిచి, తమ సంఘాన్ని దిద్దుకొనే పనిలో మునుగుతారు పెద్దలు కూడా వారికి దోహదమిస్తే —



http://www.maganti.org

నాటకానికీ, సమాజానికీ వన్నెచిన్నెలు దిద్దవచ్చు అలాటి ప్రయత్నం మనలో తక్కువ

హైదరాబాదులో నాట్య విద్యాలయం ఉత్తమ నాటక ప్రదర్శనకు కావలసిన కృషి చేస్తోంది అనుభవజ్ఞులున్నా రందులో. కళాదర్శాల్ని గమనించి నడిచేవారున్నారు వారికి 'మంచినాటకం వున్నది' అనిపించే అవకాశా లున్నాయి మంచి నాటకం...రచన ద్వారా - నటన ద్వారా మంచి సంపాదిస్తారని ఆశించవచ్చు.

ఇటీవల ఆంధ్రనాటక కళాపరిషత్తు అధ్యక్షులు... మంచి సమాజం మనకు లేదన్నారు మంచి అంటే "ఇతర వృత్తులతో సంబంధం లేకుండా, నాటకరంగాన్నే ధ్యేయంగా పెట్టుకొని, ఉత్తమమైన నాటకాలు ప్రదర్శిస్తూ వాటిని, ఇతర ప్రాంతాల కూడా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తూ వుండాలి" అని వారి అభిప్రాయం

కనుక 'మంచి నాటకం...మంచి సమాజం' అనే సమస్యలను గురించి ఆలోచించి "అవి మనకు లభ్యమైనాయి" అని చెప్పుకోగల అవకాశం - నాటక కళాభిమాను లందరూ కలిసి కల్పించాలి దీనికి అవసరమైన కృషికి సంకల్పించాలి.





http://www.maganti.org

Source: A.P. Press Academy Website, Natya Kala - 1963

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan